క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత

పెద్దకొత్తపల్లి: మండలంలోని చంద్రకల్ గ్రామానికి చెందిన ఎండీ జాఫర్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.1.50లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం పట్టణంలో బాధిత కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ఎల్‌ఓసీ అందజేశారు. కార్యక్రమంలో రమేష్ రెడ్డి, స్వామి, బండిరవి పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే నిర్లక్ష్యం



కల్వకుర్తిరూరల్: నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ నిర్లక్ష్యంగా వహిస్తున్నారని బహుజన ముక్తి పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ గడ్డం విజయ్ ఆరోపించారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే నిర్లక్ష్య వైఖరి వల్ల గ్రామాల్లో విద్యుత్, పారిశుద్ధ్యం, విద్య, వైద్య సమస్యలు తాండవిస్తున్నాయన్నారు. మౌలిక వసతుల కల్పనలో పూర్తిగా విఫలం అయ్యారన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, నరేందర్, వెంకటయ్య, శేఖర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను గుర్తించాలి

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో గ్రామసభ నిర్వహించి ఉపాధి పనులను గుర్తించాలని ఎంపీడీఓ గంగామోహన్ కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి 50 మందికి తక్కువ కాకుండా కూలీలకు పని కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపీఓ లక్ష్మణ్‌నాయక్, ఏపీఓ ప్రవీన్, ఆయా గ్రామాల కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రాజేశ్‌రెడ్డికి సెక్యూరిటీ కల్పించాలి

కందనూలు: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డికి సెక్యూరిటీ కల్పించాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మనోహర్‌ను, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు బంగారయ్య, చంద్రగౌడ్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఖాజా బాబా, మైనార్టీ మండల అధ్యక్షుడు సేమ్ నాయక్ తదితరులు ఉన్నారు.

పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు

చారకొండ: మండల కేంద్రంలోని పోచమ్మ దేవాలయంలో నూతన విగ్రహం ప్రతిష్ఠించి సోమవారానికి 42 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా దేవాలయ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి అభిషేకం, అర్చనలు చేశారు. రాములు, అఖిలేష్, లింగమయ్య, ఎంకయ్య, నర్సింహ తదితరులు ఉన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



చారకొండ: విత్తనాలు, ఎరువులు అధిక ధరలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని దుకాణాలు, సింగిల్‌విండో కార్యాలయంతో పాటు మండలంలోని జూపల్లిలో ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి డీలర్ల ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. స్టాక్ వివరాలతో బోర్డులో పొందుపర్చాలన్నారు. వారి వెంట ఆయా గ్రామాల ఏఈఓలు ఉన్నారు.

డీసీసీ ప్రధాన కార్యదర్శిగా శేఖర్

అచ్చంపేట రూరల్: డీసీసీ ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన కపిలవాయి శేఖర్‌ను సోమవారం నియమించారు. ఈ మేరకు పట్టణంలో డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ నియామకపత్రం అందజేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

వెల్దండ: మండలంలోని మైసమ్మపల్లితండాలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి సోమవారం సింగిల్‌విండో డైరెక్టర్ మొక్తాల శేఖర్ రూ.21వేలు ఉత్సవ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు.

మంత్రి కేటీఆర్ పర్యటన వాయిదా

అచ్చంపేట రూరల్: మంత్రి కేటీఆర్ అచ్చంపేట పర్యటన రెండోసారి వాయిదా పడిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తెలిపారు. అచ్చంపేటలో ఏర్పాటు చేసిన సభా వేదిక వద్ద సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



కొల్లాపూర్‌లో అర్బన్ పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని చుక్కాయిపల్లి కాలనీలో రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన అర్బన్ పార్కును ఆయన ప్రారంభించారు. రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు, 18వ వార్డు గంగమ్మ గుడి ఆలయ ప్రాంగణంలో షెడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం పట్టణంలోని మినీ స్టేడియంలో రూ.52 లక్షల వ్యయంతో నిర్మించిన యోగా కేంద్రం, జిమ్ కేంద్రాలను ప్రారంభించారు. అదేవిధంగా చుక్కాయిపల్లి గ్రామంలో రూ.75 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రహదారులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కమిషనర్ రాజయ్య, కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

కోడేరు: మండలంలోని నాగులపల్లి తండాకు చెందిన గీతాంజలికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.2.50లక్షల చెక్కును హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అందజేశారు.

జూనియర్ కళాశాల ప్రారంభం..

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను సోమవారం కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్న అదనపు గదులను కళాశాలకు కేటాయించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రంగినేని అభిలాష్ రావు, ఎంపీటీసీ రేణుకనాగరాజు, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నాగరాజు, ఉపసర్పంచ్ మశన్న, మాజీ జెడ్పీటీసీ వెంకటయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రవాణా శాఖ కార్యాలయం ప్రారంభం



కందనూలు: మండలంలోని మల్కాపూర్ గేట్ సమీపంలో ఉన్న నూతన జిల్లా రవాణ శాఖ కార్యాలయాన్ని డీటీఓ ఎర్రి స్వామితో కలిసి ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో రవాణ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా ఉమా

లింగాల: మండల తహసీల్దార్‌గా ఉమా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దేవరకొండ మండలం డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న ఆమె పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ జమీల్ కోడేరు మండలానికి బదిలీపై వెళ్లారు.

నిరుద్యోగుల దీక్ష విరమణ



కల్వకుర్తిరూరల్: మండల కేంద్రంలో నిరుద్యోగులు చేపట్టిన రిలేదీక్షలను సోమవారం మాజీ మంత్రి చిత్తరంజన్‌దాసు, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆచారి విరమింపజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి చిత్తరంజన్‌దాసు మాట్లాడుతూ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్తామన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల, విద్యావంతుల వేదిక నాయకులు పాల్గొన్నారు.

పెంచిన మెస్ చార్జీలు అమలు చేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: విద్యార్థులకు పెంచిన మెస్ కాస్మోటిక్ చార్జీలను తక్షణమే అమలు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట విద్యార్థులు ధర్నా నిర్వహించారు. అద్దె భవనాలలో కొనసాగుతున్న గురుకుల పాఠశాలలకు, కేజీబీవీలకు సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. కార్తీక్, అభినయ్, వినయ్, కృష్ణవంశీ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఆమ్ ఆద్మీ పార్టీ

వెల్దండ: పేదలకు అండగా ఆమ్ ఆద్మీ పార్టీ ఉంటుందని కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నూకం నాగేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ ఉచిత విద్య, వైద్యం, న్యాయం అనే నినాదంతో ముందుకు వస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీలో ఉంటామన్నారు. నియోజకవర్గ ప్రజలు ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో దేవేందర్, ఉదయ్‌కుమార్, సాయికుమార్, రమేష్, ప్రశాంత్, అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పథకాల పేరుతో బీఆర్‌ఎస్ మోసం



కల్వకుర్తిరూరల్: పథకాల పేరుతో బీఆర్‌ఎస్ మోసం చేస్తోందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ ధనాన్ని అధికార పార్టీ కార్యకర్తలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ దళితబంధు, బీసీ బంధు గులాబీ కార్యకర్తలకే ఇవ్వడం అప్రజాస్వామ్యం అన్నారు. మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, శేఖర్, రాహుల్, సైదులు, నానియాదవ్, బాలరాజు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలకు నిప్పు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని చుకాయపల్లిలో సోమవారం బతుకమ్మ చీరలు మహిళలకు పంపిణీ చేశారు. చీరలు నాణ్యతగా లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహిళలు బతుకమ్మ చీరలకు నిప్పు పెట్టి ఆందోళన చేశారు.



వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులతో డీఎఫ్‌ఓ రోహిత్ గోపిడి

మన్ననూర్: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని డీఎఫ్‌ఓ రోహిత్ గోపిడి ఐఎఫ్‌ఎస్ అన్నారు. వన్య ప్రాణుల వారోత్సవాల సందర్భంగా వివిధ పాఠశాలలతో పాటూ అమ్రాబాద్ మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. వన్య ప్రాణుల సంరక్షణ, మనుగడకు ప్రజల సహకారం, చిత్రలేఖనం తదితర అంశాలపై పోటీ పరీక్షలు ఏర్పాటు చేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన నవ్య, అంజలి, హీనలు నిలిచారు. సోమవారం స్థానిక ఈసీ సెంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు డీఎఫ్‌ఓ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టీ.సుధారాణి, ఎఫ్‌డీఓ విశాల్, శ్వేత, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కాన్షీరాం ఆశయాలు కొనసాగిద్దాం



అచ్చంపేటలో నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

అచ్చంపేట రూరల్: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు దివంగత కాన్షీరాం ఆశయాలు కొనసాగిద్దామని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మోత్కూరి నాగార్జున్ అన్నారు. సోమవారం బీఎస్పీ ఆధ్వర్యంలో పట్టణంలో కాన్షీరాం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యోసేఫ్, ఈశ్వర్, జాకీర్ పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాలలో బీఎస్పీ ఆధ్వర్యంలో కాన్షీరాం వర్ధంతిని నిర్వహించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీశైలం కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాన్షీరాం చిత్రపటానికి బీఎస్పీ జిల్లా కార్యదర్శి కాటం విష్ణుతేజ పూలమాల వేసి నివాళులర్పించారు.

కోడేరు: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిర్వహించిన కాన్షీరాం 17వ వర్ధంతికి అసెంబ్లీ కోశాధికారి షరీఫ్, దర్గస్వామి, రాము, దానయ్య, ఖాజ, మల్లేష్, విక్రమ్ హాజరయ్యారు.

తెలకపల్లి: మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తాలో బీఎస్పీ మండల అధ్యక్షుడు ఆర్ శివశంకర్ కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విష్ణువర్ధన్, బాలరాజు, రాంచందర్, కాశీం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: మండల కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కాన్షీరాం వర్ధంతిలో నాయకులు చంద్రశేఖర్, విజయ్, నాగార్జున, రమేష్, ఉదయ్, మహేష్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి



కల్వకుర్తిలో క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వంట కార్మికులు

కల్వకుర్తిరూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం కొనసాగింది. ఇందులో భాగంగా వంట కార్మికులు ఎంఈఓ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా చేపట్టారు. ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె శిబిరంలో నిరసన వ్యక్తం చేశారు.

ఆశావర్కర్ల నిరసన



తాడూరు మండలం అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆశావర్కర్లు

తాడూరు: ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆశావర్కర్లకు రూ.18వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు సుజాత, పద్మజ, ఇందిరమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలో చేపట్టిన ఆశావర్కర్ల నిరవధిక సమ్మె సోమవారం నాటికి 15వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం హైదరాబాద్‌లో నిర్వహించిన మహాధర్నాకు తరలివెళ్లారు. నాయకుడు గోపస్ లక్ష్మణ్ మద్దతు ప్రకటించారు. లక్ష్మి, స్వప్న, శ్రీలత, కురువమ్మ, చంద్రకళ, అలివేల పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ వైద్యం

ఉప్పునుంతల: రాష్ట్రంలో కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ వైద్యం అందుతుందని ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. సోమవారం మండలకేంద్రంలో తెలంగాణ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ) ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన 30 పడకల ఆస్పత్రి సీహెచ్‌సీని ఆయన ప్రారంభించారు. అదేవిధంగా పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్మించిన 5 వేల మెట్రిక్ టన్నుల గోదాం ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ అందరి సహకారం, ఆశీర్వాదంతో అచ్చంపేటలో 100 పడకల ఆస్పత్రి, అమ్రాబాద్‌లో 30 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేశామన్నారు. టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సీహెచ్‌సీలో అన్నిరకాల వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధాకర్‌లాల్, డీసీఎంహెచ్ రమేష్‌చంద్ర, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ మణిప్రకాష్, ఈఈ జైపాల్‌రెడ్డి, డీఈఈ వేణుగోపాల్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ తారా సింగ్, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అరుణ, పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్ రావు, సర్పంచు కట్టా సరిత, నాయకులు మనోహర్, గోపాల్‌రెడ్డి, రవీందర్‌రావు పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మేనేజర్ శ్రీకాంత్

పెద్దకొత్తపల్లి: సైబర్ నేరాలపై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్ అన్నారు. మండల కేంద్రంలో ఏపీజీవీబీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తే అధిక వడ్డీ చెల్లిస్తుందని వివరించారు. వ్యక్తిగత సమాచారాన్ని గుర్తుతెలియని వారికి చెప్పొద్దన్నారు. అనంతరం కళాజాతా ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సురేష్, విజయ్, భద్రయ్య, సిబ్బంది సంతోష్‌రెడ్డి, సాయి, అసీఫ్ పాల్గొన్నారు.

కోడేరు: మండలంలోని బావాయిపల్లిలో సైబర్‌నేరాలు, బ్యాంక్ సేవలపై ఆర్థిక అక్షరాస్యత ఎన్వీ రూరల్ ఫోక్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ కళాజాతా బృందం రాజేష్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ ధర్మతేజ మాట్లాడుతూ పంట, బంగారు, ఇంటి రుణాలతో పాటు వివిధ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా సామాజిక భద్రత పథకాలపై ప్రధాన మంత్రి సురక్ష బీమా, జీవన్‌జ్యోతి, అటల్ పెన్షన్ యోజన వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రెమ్మ, కరుణాకర్, క్యాషియర్ వెంకటేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే ప్రజా సంక్షేమం



మాట్లాడుతున్న ఆచారి

కల్వకుర్తిరూరల్: బీజేపీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని రాష్ట్ర నాయకుడు ఆచారి అన్నారు. పల్లెపల్లెకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని రఘుపతిపేటలో ఆయన పర్యటించారు. అధికార పార్టీ నాయకులు నియంతలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అవినీతి, అక్రమాల బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని సాగనంపుతాదామని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి అండగా నిలవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయన వెంట శేఖర్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, నర్సిరెడ్డి తదితరులు ఉన్నారు.

వెల్దండ: కేంద్ర ప్రభుత్వం కులవృత్తులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని జాతీయ మాజీ బీసీ కమిషన్ సభ్యుడు ఆచారి ఆకాంక్షించారు. సోమవారం మండల కేంద్రంలోని ఆకృతి గార్డెన్‌లో విశ్వకర్మయోజన పథకంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ విశ్వకర్మ యోజన పథకం ద్వారా రూ.3 లక్షలు తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి, ఎంపీటీసీ చక్రవర్తిగౌడ్, నాయకులు బాలస్వామి, మోహన్‌రెడ్డి, రామస్వామి, శ్రీనివాసచారి తదితరులు ఉన్నారు.

నిధులు మంజూరుపై హర్షం

కొల్లాపూర్: పట్టణంలో అంబేడ్కర్ కళాభవనం నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరు కావడంతో తెలంగాణ జానపద కళాకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల రాము మాదిగ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిధుల మంజూరుకు సంబంధించిన పత్రాల్ని చూపించారు. నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు పర్వతాలు, మహిళా అధ్యక్షురాలు జ్యోతి, సభ్యులు స్వాతి, శ్రావణి, సరిత, మంజు, శారద, డప్పు మధు, అంజి తదితరులున్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ సత్యం అన్నారు. సోమవారం 12వ వార్డులో దోబీఘాట్, 14, 19వ వార్డులలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాన చేశారు. వైస్ చైర్మన్ షాహెద్, కౌన్సిలర్లు మంజుల, కో-ఆప్షన్ సభ్యుడు మనోహర్ రెడ్డి, మున్సిపల్ ఏఈ శివకృష్ణ పాల్గొన్నారు.

రైతుల రాస్తారోకో



పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్ సబ్‌స్టేషన్ ఎదుట సోమవారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో కోతల విధించడంతో మొక్కజొన్న, వరి, మినుము, వేరుశనగ పంటలు నీళ్లు లేక ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు బైటాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఘటన స్థలానికి ఎస్‌ఐ సురేష్ చేరుకొని అధికారులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీంరెడ్డి, ఎల్లయ్య, గోపాల్, వెంకటయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు గృహలక్ష్మి పత్రాల పంపిణీ

వెల్దండ: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను సర్పంచ్ భూపతిరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు అందజేశారు. మండలంలోని 32 గ్రామ పంచాయతీలకు 567 మంది ఎంపికైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జైపాల్ నాయక్, గోపాల్‌నాయక్, వెంకటయ్యముదిరాజ్, మల్లయ్య, దేవేందర్, వెంకటేష్, శేఖర్, యాదగిరి, కృపానందం, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలి



కొల్లాపూర్: పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి రాఘవేంద్రకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు శివ, నందకుమార్, భానుప్రకాష్, జస్వంత్, అభిరామ్, రాజు తదితరులున్నారు.

కేసీఆర్ కుటుంబాన్ని సాగనంపుదాం

అచ్చంపేట రూరల్: అన్ని వర్గాల ప్రజలను, విద్యార్థులను, నిరుద్యోగులను, యువతను మోసం చేసిన సీఎం కేసీఆర్ కుటుంబాన్ని ఇంటికి సాగనంపుదామని బీజేపీ నియోజకవర్గ నాయకుడు శ్రీకాంత్‌బీమా అన్నారు. సోమవారం మండలంలోని రంగాపూర్‌లో బీజేపీ జెండాను ఆయన ఆవిష్కరించారు. అంతకుముందు ఉమామహేశ్వరంలో పూజలు, రంగాపూర్ నిరంజన్ షావలీ దర్గాలో ప్రార్థనలు చేశారు. ఆంజనేయులు, రేణయ్య, కమల, జ్యోతి, రమేష్, శ్రీకాంత్, శంకర్, తిర్పతయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



చారకొండ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అభివృద్ధి పనులపై సోమవారం ఎంపీడీఓ జయసుధ సమీక్ష నిర్వహించారు. ఆయా గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులు, పెండింగ్ పనులపై సమీక్షించారు. పంచాయతీ భవనాలు త్వరగతిన పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సమావేశంలో ఎంపీఓ వెంకటేష్, ఏపీఓ లక్ష్మయ్య, తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

తాడూరు: మండలంలోని ఇంద్రకల్ ప్రాథమిక పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన ప్రమోద్‌కుమార్‌ను ఎంఈఓ భాస్కర్‌రెడ్డి సోమవారం సన్మానించారు. శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసాచారి, అర్జున్, చంద్రయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

యువకులకు..

మన్ననూర్: పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి నియమితులైన యువకులను అమ్రాబాద్ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ స్థానిక లింగమయ్య స్వామి ఆలయంలో సన్మానించారు. ఉద్యోగాలు సాధించిన విజయ్, ప్రభాకర్‌లను అభినందించారు.

పత్తికి మద్దతు ధర క్వింటా రూ.7020

మన్ననూర్: పత్తికి మద్దతు ధర క్వింటా రూ.7020 నిర్ణయించినట్లు మన్ననూర్ ఏఈఓ సీతారాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీసీఐ ద్వారా కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి



అచ్చంపేట రూరల్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని విద్యార్థులు ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. సుల్తాన్, అఖిల్, అంజు, మణికంఠ, మస్తాన్, సాయి, శివ, భవాని, మౌనిక, శిరీష, ముస్కాన్ పాల్గొన్నారు.

కేసు నమోదు

వెల్దండ: మండలంలోని కుప్పగండ్ల శివారులో పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆవుతున్న ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.5,510 స్వాధీనం చేసుకునట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి

ఊర్కొండ: మండలంలోని ఇప్పపహడ్‌లో సోమవారం రైతు కరుణాకర్‌రెడ్డికి సంబంధించిన ఆవు విద్యుదాఘాతంతో మృతి చెందింది. గ్రామ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలకు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందిందని బాధిత రైతు తెలిపాడు.

పోలీసులకు ఫిర్యాదు

బిజినేపల్లి: ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పదేళ్ల ప్రజాప్రస్థానం యాత్రలో భాగంగా ఆదివారం గుడ్లనర్వలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు ఘర్షణ పడ్డారు. ఈ మేరకు సోమవారం బిజినేపల్లి పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసుకొన్నారు.

పార్టీ జెండాల తొలగింపు

వెల్దండ: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఉన్న పలు రాజకీయ పార్టీల జెండాలను, పోస్టర్లను సోమవారం అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకొని పార్టీలకు చెందిన జెండాలను తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరైన కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

భూమిపూజ

బల్మూర్: మండల కేంద్రంలో సీసీ రోడ్లు నిర్మాణాలు, బందెరదొడ్డి, ఊర చెరువు అలుగు పనులకు సర్పంచ్ శివశంకర్ భూమి పూజ చేశారు. ఉప సర్పంచ్ తిరుపతి, కార్యదర్శి చందు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.